# జేపీ ఖల్‌నాయక్

## ● రేవంత్‌రెడ్డి తీవ్రవిమర్శ

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** లోక్‌సత్తాతో బహిరంగ చర్చకు తాము పలాయనం చిత్త గించామనడం సరికాదని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది. చర్చకు ముందు తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సూచించింది. లోక్‌సత్తాకు సంబంధించి కొన్ని వాస్తవాలు వెలుగులోనికి రావాల్సి ఉందని వ్యాఖ్యానించింది. లోక్‌సత్తా స్పందించిన తరువాత బహిరంగ చర్చకు సిద్ధమవుతామని, దీనిపై వెనక్కు తగ్గే సమస్యే లేదని తెదేపా నేత, కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి చెప్పారు. శుక్రవారమిక్కడ ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు.

లోక్‌సత్తా ప్రతిపక్షంగా ఉంటూనే అధికార పక్షాన్ని కాపాడే ప్రయత్నాలు చేస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ అనే విషవృక్షంలో కనిపించని మొక్క లోక్‌సత్తా పార్టీ అని వ్యాఖ్యానించారు. ఇందిరా గాంధీ నియంతృత్వ ధోరణి, ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా ఆనాడు లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ కృష్ణ సారథ్యం వహిస్తే... ప్రస్తుతం లోక్‌సత్తాఅధినేత కాంగ్రెస్‌కు అనుకూలంగా శల్య సారథ్యం వహిస్తున్నారనిదుయ్యబట్టారు. జేపీ ప్రజాస్వామ్యం పాలిట ఖల్‌నాయక్ అని మండిపడ్డారు. ఆయన కోవర్టు, కన్వర్ట్, డైవర్ట్ రాజకీయాలు మానుకుని డైరెక్ట్ రాజకీయాలు చేస్తూ ప్రజల పక్షాన పోరాడితే బాగుంటుందని సూచించారు. అసెంబ్లీ నుంచి వాకౌట్ చేయబోనని చెప్పిన జేపీ, తెదేపా కార్యాలయంపై చెప్పులతో దండయాత్ర ఎలా చేయించారని ప్రశ్నించారు. వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమని చెబుతూ సోనియా గాంధీ సారథ్యంలోజేపీ జాతీయ సలహా మండలిలో సభ్యుడిగా పని చేయటాన్ని తప్పుబట్టారు. విద్యా వ్యాపారాన్ని అడ్డుకుంటామని చెబుతూ కార్పొరేట్ కళాశాల నిర్వాహకుడైన లావు రత్తయ్యకు పార్టీ టిక్కెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. లోక్‌సత్తా స్వచ్ఛంద సంస్థ ముసుగులో నిధులు సమీకరించుకుని రాజకీయాలకు వెచ్చించారని విమర్శించారు. లోక్‌సత్తా గతఎన్నికల్లో ప్రతిపక్ష ఓట్లను చీల్చి కాంగ్రెస్ విజయానికి తోడ్పడిందని పునరుద్ఘాటించారు. దీనిని ప్రజలే అర్థం చేసుకుంటారన్నారు.

